# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భోగాపురం.. ప్రపంచ స్థాయి విమానయాన కేంద్రంగా రూపుదిద్దుకోనుందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ తెలుగు భాష, సంస్కృతి ప్రవాసాంధ్రుల్లో అంతర్భాగంగా ఉందని మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ తెలిపారు.
- ❖ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు.
- ❖ డోలీ రహిత గిరిజన గ్రామాలే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

=====================

భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయం రానున్న కాలంలో ప్రపంచ స్థాయి విమానయాన కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానంలో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ఆయన ఈ రోజు చేరుకున్నారు. తొలి విమానం విజయవంతంగా ల్యాండ్ కావడం గర్వకారణమని ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్రమంత్రి చెప్పారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్ని అనుకున్న సమయానికంటే ఆరు నెలల ముందుగా పూర్తి చేస్తున్నామని రామ్మోహన్ నాయుడు వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

భోగాపురం గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర జిల్లాలలో వేగవంతమైన అభివృద్ధి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానం భోగాపురం ఎయిర్ పోర్టులో విజయవంతంగా ల్యాండ్ కావడం పట్ల ముఖ్యమంత్రి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో భోగాపురం ఎయిర్ పోర్టు ఒక చోదక శక్తిగా మారనుందని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. జూన్ నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ప్రారంభం కావడంతో పాటు ప్రజలకు అందుబాటులోకి రానుండటం మంచి పరిణామంగా తెలిపారు.

=====================

తెలుగు భాష, సంస్కృతి ప్రవాసాంధ్రుల్లో అంతర్భాగంగా ఉందని మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ తెలిపారు. గుంటూరు జిల్లాలో జరుగుతున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలలో భాగంగా రెండవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 50 దేశాలలో తెలుగు మాట్లాడేవారు ఉన్నారని చెప్పారు. తెలుగు మహాసభల నిర్వహణ ద్వారా భాష, నాగరికతను మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక వారసత్వాన్ని సైతం ముందుకు తీసుకుని వెళ్ళేందుకు వీలుందని తెలిపారు. భారత్, మారిషస్‌ల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

ఈ కార్యక్రమంలో భాగంగా ధరమ్ బీర్ గోకుల్‌కు ఆంధ్ర సారస్వత పరిషత్ భారతమిత్ర అవార్డును ప్రధానం చేసింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

=====================

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. లూయి బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా ఒంగోలు చర్చి సెంటర్‌లో ఉన్న బ్రెయిలీ విగ్రహం వద్ద ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... దివ్యాంగులకు ఇంద్రధనస్సు పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, నెలకు 6 వేల రూపాయల పింఛను అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

విరామం

=====================

కేంద్రంలో అనేక సంస్కరణలను 2025లో తీసుకువచ్చిన ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రతిభావంతమైన పని తీరుని చూపించారు. ప్రపంచ దేశాలతో సన్నిహిత సంబంధాలను నెరపుతూ కీలక నేతగా ఆయన వ్యవహరించారు. 2025లో దేశ విదేశాలలో నరేంద్ర మోదీ సాధించిన విజయాలపై ఆకాశవాణి అందిస్తున్న ప్రత్యేక కథనం..

భారత్ పై అమెరికా అధిక వాణిజ్య సుంకాలను విధించినపుడు దేశానికే తొలి ప్రాధాన్యత అని నరేంద్ర మోదీ స్పష్టమైన సందేశాన్ని పంపించారు. అలాగే రెండవ తరం GST సంస్కరణలను దేశంలో అమలు చేయడం ద్వారా పేదలు, మధ్య తరగతి వర్గాలకు ఎంతో మేలు చేసే చర్యలను తీసుకున్నారు. నాలుగు కార్మిక కోడ్‌ల అమలు వంటి ప్రధాన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. స్థూల దేశీయోత్పత్తి 8.2 శాతం వృద్ధి రేటు సాధనకు ఇవి దోహదపడ్డాయి. జాతీయ భద్రత విషయంలో చూస్తే.. పహల్గామ్ దాడి తరువాత భారతదేశం ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టడం ద్వారా సరైన జవాబుని చెప్పడమే కాదు, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 29 అంతర్జాతీయ గౌరవాలను 2025లో ప్రధానమంత్రి అందుకున్నారు. ఇదే ఏడాది వ్యూహాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద విప్లవం ద్వారా భారతదేశ ఆర్థిక దౌత్యం కొత్త శిఖరాలకు చేరుకుందని చెప్పాలి. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలోని శాసనసభలలో నరేంద్ర మోదీ 18 ప్రసంగాలు చేశారు.

=====================

డోలీ రహిత గ్రామాలే లక్ష్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణం క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని మంత్రి ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం పార్వతీపురం మన్యం జిల్లాకు 105 కోట్ల

రూపాయలను మంజూరు చేశామని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు, మెస్ ల అభివృద్ధికి 37 కోట్ల 51 లక్షల రూపాయలు, అలాగే జిల్లాకు 4 కోట్ల 35 లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

======================

ఆంధ్రప్రదేశ్ లో వెనకబడిన వర్గాల రక్షణ కోసం బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. విజయవాడలోని స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బీసీ, ఓబీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభకు ఆయన ఈ రోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీసీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. అదే విధంగా బీసీలు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు.

చట్టసభలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై తీర్మానం కేంద్రానికి పంపించామని ఈ సభలో పాల్గొన్న రాష్ట్ర బీసీ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.

======================

విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో దివంగత సీనియర్ న్యాయవాది ఎంకే సీతారామయ్య చిత్రపటాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. సీతారామయ్య న్యాయవాదిగా విజయవంతంగా రాణించారని కొనియాడారు.

======================

దేశంలో విభిన్న సిద్ధాంతాలున్న పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన ఘనత దివంగత నేత పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయిదేనని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. గుంటూరులోని లక్ష్మీపురం కూడలిలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో వాజ్ పేయి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

======================

======================